మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంప్రదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 249 08 శుక్రవారం, మార్చి 2024 పేజీలు: 4/వెల రూ5/-

# కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేయాలి

కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తే
కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉంటార్న సీఏం
కేంద్రంతో సఖ్యత కోసమే ప్రధాని మోదీని కలిసినట్లు వెల్లడి
ఆర్ఆర్ఆర్ కాంగ్రెస్ హయాంలోనే వచ్చిందన్న రేవంత్‌రెడ్డి
బీఆర్ఎస్ హయాంలో
పబ్బులు, గంజాయి, డ్రగ్స్ వచ్చాయని విమర్శ




మాజీ మంత్రి కేటీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సూచన చేశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేయాలన్నారు. అందుకు కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉంటారని సీఏం చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రంతో అంటీముట్టనట్టు ఉండడం వల్లే నిధులు రాలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంతో స్నేహంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీతో పాటు రక్షణశాఖ మంత్రిని కలిశామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మెట్టుదిగడంలో తప్పేముందని అన్నారు. హైదరాబాద్‌లో రామగుండం ఎలివేటడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్డు విషయమై కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. ఆర్ఆర్ఆర్ కాంగ్రెస్ హయాంలోనే వచ్చిందన్న సీఏం.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పబ్బులు, గంజాయి, డ్రగ్స్ వచ్చాయని దుయ్యబట్టారు.

## తెలంగాణలో అనుకూలంగా వాతావరణం

17సీట్లు గెల్చుకునేలా
సన్నద్ధం కావాలి
పార్టీ శ్రేణులతో బిజెపి
అధ్యక్షుడు కిషన్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి7(మరో ఉదయం):**

పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ యంత్రాంగం సిద్ధం కావాలని బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉందన్నారు. అనుకూల వాతావరణాన్ని బీజేపీకి మరింత సానుకూలంగా మార్చుకోవాలని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. పెండింగ్ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై చర్చ నిర్వహిస్తున్నారు. ఈనెల 12న అమిత్ షా పర్యటనపై సైతం సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అదిలాబాద్, సంగారెడ్డి సభలు విజయవంతం అయ్యాయన్నారు. పార్టీ బలహీనంగా ఉన్న ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కూడా విజయ సంకల్పయాత్ర విజయవంతమైందన్నారు. పార్టీ జెండా మీదనే యాత్ర నిర్వహించామని తెలిపారు. బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు. బీజేపీను దెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారని.. 17స్థానాల్లో విజయం సాధించే విధంగా ఎన్నికల నిర్వహణ ఉండాలని కిషన్ రెడ్డి కోరారు.

# పాలమూరు వెనకబాటుకు కాంగ్రెస్,టిడిపిలే కారణం

చంద్రబాబు పాపాలు,
కాంగ్రెస్ లోపాలే శాపాలు
పెండింగ్ ప్రాజెక్టులను
రన్నింగ్ ప్రాజెక్టులు చేసిన కెసిఆర్
రేవంత్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు



**సంగారెడ్డి,మార్చి7(మరో ఉదయం):**

మిగతా 2 లో

# ఉక్రెయిన్‌పై క్షిపణిదాడి

తృటిలో తప్పించుకున్న
ఇరు దేశాధినేతలు

**న్యూఢిల్లీ,మార్చి7(మరో ఉదయం):**

రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం మొదలై గత నెల నాటికి రెండు సంవత్సరాలు పూర్తయ్యింది. అయినా కూడా పలు దేశాల నేతలు ప్రయత్నాలు చేసినా కూడా ఇప్పటి వరకు ఈ దేశాల మధ్య శాంతి నెలకొనలేదు. ఇప్పటికీ యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఉక్రేనియన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, గ్రీస్ ప్రధాన మంత్రి కిరియాకోస్ను కలిసేందుకు వెళ్లిన సమయంలో మరో ఎటాక్ జరిగింది. అయితే అతని కాన్వాయ్ అతి సమీపంలోనే రష్యా క్షిపణిచే దాడి జరుగగా ఇద్దరు దేశాల నేతలు తృటిలో తప్పించుకున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ గ్రీక్ ఎంబసీకి చేరుకున్నప్పుడు 100 మీటర్ల దూరంలో రష్యన్ క్షిపణి దాడి జరిగిందని తెలుస్తోంది. ఆ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్వల్పంగా తప్పించుకున్నట్లు చెబుతున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత జలెన్స్కీకి అతి సమీపంలో క్షిపణి దాడి జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఘటన చాలా నష్టాన్ని కలిగించిందని తనకు తెలుసని జెలెన్స్కీఈ ఘటన తర్వాత అన్నారు. తన దగ్గర ఇంకా అన్ని వివరాలు లేవని, కానీ చాలా మంది మరణించారని వెల్లడించారు. మనం ముందుగా మనల్ని మనం రక్షించుకోవాలని అన్నారు. దానికి ఉత్తమ మార్గం బలమైన వాయు రక్షణ వ్యవస్థను కల్గి ఉండటమేనని చెప్పారు. అంతేకాదు రష్యా ఇంతకుముందు కూడా చాలాసార్లు ఒడెస్సాను లక్ష్యంగా చేసుకుంది.

# 15నుంచి ఒంటిపూట బడులు

18 నుంచి టెన్త్ పరీక్షలు
ఉత్తర్వులు జారీచేసిన
ప్రభుత్వ విద్యాశాఖ

**హైదరాబాద్,మార్చి7(మరో ఉదయం):**

వేసవి తీవ్రత పెరుగుతున్నందున ఈ నెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 వరకు అంటే విద్యా సంవత్సరం ముగిసే వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒంటి పూట బడులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు బడులు నడపాలని స్పష్టం చేసింది.ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 12:30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టి పంపించాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. పది పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల్లో పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగుతాయని వెల్లడించింది.

# వర్షపాతంపై సిఎం రేవంత్ తప్పుడు సమాచారం

గతేడాది 14శాతం
అత్యధిక వర్షపాతం
లోటు వర్షపాతం
పేరుతో అబద్దాలు
: కెటిఆర్




**హైదరాబాద్,మార్చి7(మరో ఉదయం):**

తెలంగాణలో వర్షపాతం నమోదుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షపాతంపై ముఖ్యమంత్రివి అబద్దాలని చెప్పారు. భారత వాతావరణ శాఖ లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాధారణం కంటే 14 శాతం ఎక్కువ వర్షపాతం రాష్ట్రంలో నమోదైందని తెలిపారు. నీటి సమస్యలు తీర్చే సామర్థ్యం లేక.. లోటు వర్షపాతమంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అబద్దాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సత్యదూరమైన మాట్లాడటం పట్ల తెలంగాణ సమాజం అసహ్యించు కుంటున్నదని తెలిపారు. రైతు సమస్యల పరిష్కారంపై రేవంత్ వ్యాఖ్యలు ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శన మని విమర్శిం చారు.లెక్కల ప్రకారం 2023-24 సంవత్సరానికి సాధారణానికంటే 14శాతం ఎక్కువ వర్షపాతం తెలంగాణలో నమోదు అయ్యింది. నీటి సమస్యలని తీర్చే చేవలేక, చేతకాక .. లోటు వర్షపాతం అని మాట్లాడడం విడ్డూరం అన్నారు. అబద్దాలు, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు సత్యదూరపు మాటలు మాట్లాడుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత వారి ప్రవర్తన చూసి తెలంగాణ ప్రజలు అసహ్యించు కొంటున్నారు. సమస్యలు తీర్చడం మాట అటుంచి, తెలంగాణ రైతాంగానికి మూడు నెలల్లోనే స్కాంగ్రెస్ చేతగానితనం పూర్తిగా అర్థ మయ్యిందని పేర్కొన్నారు.

# చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోసగాళ్లే

పదేళ్లుగా మనలను గొర్రెలుగా మార్చారు - ప్రత్యేకహోదాపై పోరాడకుండా ఏమార్చారు
హోదావచ్చివుంటే ఎపి ఎప్పుడో అభివృద్ధి అయ్యేది - మోడీ కేడీలా ఎపిని మోసం చేశారు
ఇక సింహాల్లా పోరాడితేనే హోదా సాధ్యం - కాంగ్రెస్ మాత్రమే దీన్ని సాకారం చేయగలదు
పార్టీ ఆందోళనా కార్యక్రమంలో షర్మిల పిలుపు

**విజయవాడ,మార్చి7(మరో ఉదయం):**

మిగతా 2 లో



మార్పు కోసం... మరో ఉదయం TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## మహిళాభ్యుదయం మన సంకల్పం కావాలి !

ఏటా మహిళా సదస్సుల..మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. ఆడపిల్లల చదువులకు, క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏవీ అమలు కావడం లేదు.ఆడపిల్లల చదువులకు ప్రత్యేక రుణాలు, వడ్డీలేని పథకాలు అమలుచేసివుంటే బాగుండేది. ఉద్యోగాలు లేవు. చదువుకునే మహిళలకు కనసీం ఫ్రీ చదువులు లేవు. విద్యా రుణాలు తీసుకుంటే కనీసం వడ్డీ మాఫీ గురించి కూడా ఆలోచన చేయడం లేదు. అలాచేసివుంటే బేటీపడావో..బేటీ బచావోకు అర్థం ఉండేది. మహిళలను గౌరవిస్తున్న మనదేశంలో మహిళల కోసం ఏం చేశారంటూ ఏమీ లేదు.ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేయడం మాత్రం అభినందించాల్సిందే. ఘనత వహించిన మోడీకి ఇవన్నీ తెలియనివి కాదు. జిఎస్టీ రాబుడులను ఎలా పెంచాలన్న ఆలోచన తప్ప ఇలాంటి విషయాల్లో చిత్తశుద్ధి లేదు. ఆర్థిక మంత్రిగా ఓ మహిళ ఉన్నా మహిళలకు ఒనగూరుతున్న ప్రయోజనం లేదు. మహిళా బిల్లుకు సంబంధించి బిల్లు పాస్ యినా అది అప్పుడే అందుబాటులోకి రాలేదు. దానికి మరో ఐదేళ్లు వేచిచూడాల్సి రాక తప్పదు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో అధికార విపక్ష సభ్యులు ఉమ్మడిగా విఫలం అయ్యారు. బిల్లును పాస్ చేసినా అమలు కాకుండా అటకెక్కించారు. ఈ బిల్లుతో రాజకీయ లబ్ది పొందాలనలన్న బిజెపి ఎత్తుగడ తప్ప వారికి మేలు చేయాలన్న పట్టుదల, చిత్తశుద్ధి మోడీలో లేకుండా పోయింది. ఈ ఎన్నికల్లోనే వారికి రిజర్వేషన్లు అమలయివుంటే బాగుండేది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా ఏటేటా జరుపుకుం టున్నా...మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే ఇంతకాలం అడ్డుకున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. బేటీపడావో.. బేటీ బచావో ఓ నినాదంగా మారింది. కనీసం వారి అభిప్రాయా లకు విలువను ఇచ్చినట్లుగా ఉండేది. కానీ అలా జరగలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. సమాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే రేప్ చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగి పోతున్నారు. అందుకే చట్టసభల్లో వారికి గౌరవం ఇచ్చేలా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలుచేసివుంటే బాగుండేది. పరిస్థితులపై మనమంతా మహిళల హక్కులపై చర్చించాలి. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా.. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్య పెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందనడంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలి. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా తగినంతగా ప్రోత్సాహం మాత్రం దక్కడం లేదు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు

సాకుండా అణగదొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ,పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల దక్కితేనే మరింతగా రాణిస్తారు.వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారం అవుతున్నాం. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. అన్నిరంగాల్లో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. అలాగే చదువుకునే అమ్మాయిలకు ఉచిత విద్యా రుణాలు అందాలి. అలాగే వారి ఉన్నత విద్యాకు ప్రభుత్వాలు చేయూత నివ్వాలి. బేటీపడావో ..బేటీ బచావో నినాదం కార్యరూపం దాల్చాలి.మహిళలను విలాసవస్తువుగా చూసే సంస్కృతిపై కఠినంగా వ్యవహరించాలి. అత్యాచారాలు, వేధింపులపై కఠినంగా వ్యవహరించేలా చట్టాలు రావాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికార పక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన మన సంస్కృతిని ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో సమాజం వారిపట్ల గౌరవభావంతో సాగాలి. విద్యా,క్రీడా, సాంస్కృతిక రంగాల్లో వారిని ముందుకు నడిపించేలా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలి. అప్పుడే మనం ఆశించిన మహిళాభ్యుదయం సాకారం అవుతుంది.

# పాలమూరు వెనకబాటుకు

మొదటి పేజీ తరువాయి

# కాంగ్రెస్,టిడిపిలే కారణం

మహబూబ్‌నగర్ వెనుకబాటుతనానికి నాటి టీడీపీ, కాంగ్రెస్ పాలనే కారణమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సీఎం రేవంత్ తిట్టాల్సి వస్తే తన గురువు చంద్రబాబును తిట్టాలని, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను నిందించాలన్నారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ పార్టీ లోపాలు పాలమూరు పాలిట శాపాలుగా మారాయని విమర్శించారు. పాలమూరు వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంగారెడ్డిలో పార్టీ నాయకులతో కలిసి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. పాలమూరు వలసలకు కారణం టీడీపీ, కాంగ్రెస్‌లేనన్నారు. గత పార్టీలు ప్రాజెక్టుల పేర్లు మార్చారు తప్ప పనులు పూర్తి చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చారని విమర్శించారు. ఆ పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ రన్నింగ్ ప్రాజెక్టులు గా మార్చారని చెప్పారు. పాలమూరును పచ్చబడేలా చేసింది కేసీఆరేనని స్పష్టం చేశారు. పాలమూరుకు మళ్లీ వలసలు తిరిగొచ్చాయన్నారు. 2014కు ముందు పాలమూరు ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉందని ప్రశ్నించారు. పాలమూరును ఆనాడు చంద్రబాబు దత్తత తీసుకున్నారని, పదేండ్లు అధికారంలో ఉన్నా చంద్రబాబు పాలమూరుకు చేసిందేమీ లేదన్నారు. పాలమూరు కరువుతో కాంగ్రెస్, టీడీపీలు రాజకీయాలు చేశాయని విమర్శించారు. తాము పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులు సాధించామని, కాలువలు తవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. పోతిరెడ్డిపాడు నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నీళ్లు తీసుకెళ్తుంటే రేవంత్ మాట్లాడలేదని విమర్శించారు. నాడు జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చారని ఆరోపించారు. 30 ఏండ్లలో కల్వకుర్తి ఆయకట్టు కిద 13 వేల ఎకరాలకు నీళ్లిచ్చారని, బీఆర్ఎస్ హయాంలో అదే కల్వకుర్తి కింది 3 లక్షల 7 వేల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. నెట్టంపాడు కింద ఆనాడు 2700 ఎకరాలకు నీరివ్వగా, మహబూబ్ నగర్ జిల్లాలో తారు 6 లక్షల 50 వేల ఎకరాలకు నీళ్లిచ్చామని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో పాలమూరు నుంచి ప్రజలు వలసలు వెళ్లారని, కేసీఆర్ పాలనలో వలసలు వెళ్లిన ప్రజలు పాలమూరుకు తిరిగి వచ్చారని చెప్పారు. సాగు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ముందుకు తీసుకెళ్లామన్నారు. ఉమ్మడి పాలనలో ఒక్క మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదని, కానీ తాము పాలమూరు జిల్లాలో ఐదు మెడికల్ కాలేజీలు, టీచింగ్ దవాఖానలు ఇచ్చామని గుర్తుచేశారు.సీఎం రేవంత్ రెడ్డి తన పౌరుషాన్ని పాలనలో చూపెట్టాలని ఎద్దేవాచేశారు. ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే నోటికొచ్చినట్టు మాట్లాడొద్దని సూచించారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. కేసీఆర్ కిట్లు తెస్తే.. రేవంత్ రెడ్డి తిట్లలో పోటీ పడుతున్నారని విమర్శించారు. తన ఎత్తు గురించి కూడా రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, తాను కూడా ఆయన ఎత్తు గురించి మాట్లాడగలనని.. కానీ తనకు విలువలు ఉన్నాయని చెప్పారు. ఎవరెంత ఎత్తు ఉన్నారో ప్రజలకు అవసరం లేదని వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి

# చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోసగాళ్లే

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊపిరి లాంటిది. ఈ విషయంలో తల్లి లాంటి ఏపీని జగన్ వెన్నుపోటు పొడిచారని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రతిపక్ష నేతగా నిరాహార దీక్షలు చేశారు. మూకుమ్మడి రాజీనామాలు చేద్దామన్నారు. సీఎం అయ్యాక ఆ పార్టీ నుంచి ఒక్కరైనా రాజీనామా చేశారా? ఒక్కటైనా నిజమైన పోరాటం చేశారా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తానని వైఎస్ షర్మిల ప్రకటించారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నా హోదా రాలేదన్నారు. పదేళ్ల నుంచి ఆంధ్రవారిని అధికార పార్టీలు గొర్రెలను చేశారని షర్మిల ధ్వజమెత్తారు. హోదా కోసం సింహాల మాదిరిగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. హోదా గురించి తలచుకొని షర్మిల కన్నీటి పర్యంతం అయ్యారు. 'గత పదేళ్ల నుంచి హోదా ఊసే లేదు. హోదా అంటే ఏంటోనని వింతగా చూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక హోదా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఉద్యమించాలని నిర్ణయించు కుంది. ప్రత్యేక హోదా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడకుంటే హోదా రాదు. 10 ఏళ్లలో ఏ ఒక్కరూ పోరాటం చేయలేదు. ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు. ప్రజలు గొర్రెల లెక్క కాదు...సింహాల లెక్క బ్రతకాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారు. గొర్రెలను బలి ఇస్తారు.. సింహాలను బలి ఇవ్వరు అన్నారు. హోదా విషయంలో 10 ఏళ్లు గొర్రెలు అయ్యాం. మొదటి 5 ఏళ్లు చంద్రబాబు గొర్రెలను చేశాడు. తర్వాత 5 ఏళ్లు జగన్ గొర్రెలను చేశాడు. ఇప్పుడు మనం గొర్రెలం కాదు సింహాలం. సింహాల మాదిరిగా పోరాటం చేయక పోతే హోదా రాదు. పోరాడితే పోయేది ఏమి లేదు..బానిస సంకెళ్లు తప్పా అని' షర్మిల విరుచుకుపడ్డారు. 'తాము ఇన్నాళ్లు మంచిగా ఉన్నది చాలు. అలా ఉంటే హోదా ఇచ్చారా ? మంచిగా ఉంటే పోలవరం కట్టారా? ఆంధ్రులను మోసం చేసిన ప్రధాని మోదీ ఒక డిఫాల్టర్. మోదీ ఒక కేడీ. హోదా వచ్చి ఉంటే మన రాష్ట్రం డెవలప్ అయ్యేది. హోదా వస్తే రూ.15 లక్షల కోట్లు వచ్చేవి. జగన్ అన్నకి అభివృద్ధి ధ్యాస లేదు. మాట ఇచ్చి మడత పెట్టిన ఘనత జగన్‌ది. జలయజ్ఞం కింద వైఎస్ఆర్ కట్టిన ప్రాజెక్టలకు దిక్కులేదు. వ్యక్తిగత రాజకీయాల కోసం ఏపీకి రాలేదు. రాజకీయాలు కావాలంటే 2019లో ఇక్కడ పార్టీ ఏర్పాటు చేసే వారం. హోదా సాధన, విభజన సమస్యల కోసం వచ్చా. రాహుల్ గాంధీ ఇచ్చిన మాటతో వైఎస్ఆర్ బిడ్డ ఆంధ్రలో అడుగు పెట్టింది. హోదాపై మొదటి సంతకం పెడతా అని హామీ ఇచ్చారు. అందుకే వచ్చా. హోదా లేకపోతే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి లేదు. హోదా రాకపోతే మన బిడ్డలకు ఉద్యోగాలు రావు. రాష్ట్రానికి భవిష్యత్ లేదు. ప్రత్యేక హోదా ఊపిరి అవుతుంది. ఊపిరి లేకుండా బ్రతక గలమా ? రాష్ట్రమంతా కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించాలి. హోదా సాధించే వరకు విశ్రమించేది లేదు అని' షర్మిల స్పష్టం చేశారు. బీజేపీకి రాష్ట్రంలో ఒక్క ఎంపీ లేరు .. ఒక్క ఎమ్మెల్యే లేరు. అయినా రాష్ట్రంలో బీజేపీ రాజ్యం ఎలుతుంది. జగన్ ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు. జగన్ అధికారంలో ఉంటే బీజేపీ ఉన్నట్లే. హోదా వచ్చి ఉంటే వేల సంఖ్యలో పరిశ్రమలు వచ్చేవి. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు దాటిన రాజధాని లేదు. హైదరాబాద్ 10 ఏళ్లు ఇస్తే అవసరం లేదని వచ్చారు. ఇక్కడ ఏం ఉద్ధరించారు. రాష్ట్రానికి సిగ్గు చేటు. ఇతర రాష్ట్రల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుంది. రాష్ట్రం మాత్రం 25 ఏళ్లు వెనక్కి వెళ్ళింది. ఆంధ్ర అభివృద్ధి నాది అని మోదీ హామీ ఇచ్చారు. ఏ ఒక్క హామీ సైతం నెరవేర్చలేదు అని' వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదని వైఎస్ షర్మిల అన్నారు. అలా అనుకుంటే 2019లోనే ఇక్కడ అడుగు పెట్టేదాన్ని అని వ్యాఖ్యానించారు. పోరాడకపోతే ప్రత్యేక హోదా ఎప్పటికీ రాదన్నారు. ఈ క్రమంలో ఆమె భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. 'హోదా మన బిడ్డల హక్కు.. దీన్ని ఎంతమంది పట్టించుకున్నారు? అది వచ్చి ఉంటే రాజధాని, పోలవరం మనం కట్టుకోలేమా? మన రాష్ట్రం ఎందుకు తక్కువగా ఉండాలి. ప్రత్యేక హోదా ఇస్తానన్న ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ. ఆయన మాటతోనే నేను ఏపీ రాజకీయాల్లో అడుగుపెట్టా అని షర్మిల అన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ తీరుపై నిరసన కార్యక్రమాలు చేపడితే ఉలుకు పాటు ఎందుకు...

## కూకట్పల్లి నియోజకవర్గం బారాస కోఆర్డినేటర్ సతీష్ ఆరోరా

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**

బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ తీరుపై నిరసన కార్యక్రమాలు చేపడితే ఉలుకుపాటు ఎందుకనీ కూకట్పల్లి నియోజకవర్గం బారాస కోఆర్డినేటర్ సతీష్ ఆరోరా ధ్వజమెత్తారు. పార్టీలోని వసూల్ రాజాలను వెంటేసుకొని తిరుగుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులపై విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేశ్క చెల్లిందన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని కొత్తగా రాజకీయం మొదలు పెట్టిన బండి రమేశ్ తన వెంట తిరుగుతున్న వారి గత చరిత్రలు తెలియకపోవడమే కాకుండా వాళ్ల చేతుల్లో కీలుబొమ్మగా మారి ఇతర పార్టీల నాయకులను విమర్శించడమే రాజకీయం అన్నట్లుగా వ్యవహరిస్తుండడం శోచనీయం అన్నారు. గడిచిన ఎన్నికలకు ముందు ఇష్టం వచ్చినట్లు, నోటికి వచ్చినట్లు మా నేతపై ఆరోపణలు చేసినా ప్రజలు ఎవరూ పట్టించుకోకపోగా రెట్టింపు మెజార్టీని కట్టబెట్టిన విషయం బండి రమేశ్ మరిచిపోయినట్లు ఉన్నారనీ ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అలవికాని హామీ లను ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అసలు చేయకపోవడంతోనే బాధ్యతాయుత ప్రతిపక్షపార్టీగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ తీరుపై నిరసన కార్యక్రమాలు చేపడితే మీరెందుకు ఉలికిపడుతున్నారనీ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజల కోసం నిరసన తెలిపితే బండిరమేశ్ ఉలికిపాటుకు గురికావడం చూస్తే తన రాజకీయ అస్థిరత ఎక్కడ బయటపడుతుందోనని ముందే తొందరపడినట్లు అనిపిస్తుందన్నారు. నిజానికి గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే (ఉమ్మడి ఖైరతాబాద్) కూకట్పల్లి నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవ్వడంతో పాటు ఆనాటి పేరొందిన నాయకుల పేర్లతోనే కాలనీలు, బస్తీలు కూడా ఏర్పడ్డాయన్నారు. నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన బండిరమేశ్ ముందు నియోజకవర్గంలో ఎవరు ఏమిటో ఎలాంటి వారో పూర్తిగా తెలుసుకొని ఆరోపణలు చేస్తే బాగుంటుందనీ హితవు పలికారు. ప్రస్తుతం ఉన్న పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ అధికారులను ఎవరెవరు బెదిరిస్తున్నారో, ఎవరెవరు బేరాలు కుదుర్చుకుంటున్నారో కూకట్పల్లి ప్రజలందరికి తెలుసునన్నారు. ఎందుకంటే కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలు రాజకీయంగా చాలా చురుకుదనం, అవగాహన కలిగిన ఉంటారనీ గుర్తుంచుకోవాలన్నారు. కూకట్పల్లి నియోజకవర్గంలో ఓటమి పాలై కనీసం నెలరోజులు కూడా గడువకముందే గెలుపొందిన మా నాయకుడిపై విమర్శలు చేయడం, రాజకీయంగా కనిపించకుండా పోయిన వసూల్ రాజాలను తిరిగి మీ వెంట తిప్పుకుంటూ చెరువులు, కుంటలు, కాలువల చుట్టూ తిరుగుతూ రాజకీయ బింకాలకు పోవడం మీకు మాత్రమే చెల్లిందనీ ఎద్దేవా చేశారు. మేము మాత్రం కాంగ్రెస్ పార్టీ (ప్రజలకు) ఇచ్చిన హామీలను నెరవేర్చమని మాత్రమే వినతిపత్రాలను, నిరసన ప్రదర్శనలు చేశామనీ మీలాగా ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించడం లేదన్నారు. ఇప్పటికైనా మీరు మీతో తిరుగు తున్న వారి చరిత్రలు తెలుసుకొని ఇతరులపై ఆరోపణలు చేస్తే కనీసం



చూసేవారికైనా బాగుంటుందనీ ఇక మీ ద్వారా మా పార్టీ నాయకులు నీతులు చెప్పించుకునే స్థితిలో లేరని, మాకు నీతులు చెప్పే స్థాయి నీకు అసలే లేదనే విషయం గుర్తించడం మీకు చాలా అవసరమని సతీష్ అరోరా హితవు పలికారు.

# మహిళలకు సముచిత స్థానం ఇచ్చే ఏకైక పార్టీ కాంగ్రెస్సే - కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్

**మరో ఉదయంప్రతినిధి కూకట్పల్లి**

మహిళలకు సముచిత స్థానం ఇచ్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.బాలనగర్ పార్టీ కార్యాలయంలో గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వనజ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు వందమంది తో ఆమె కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయడానికి, ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ముందుకు వస్తున్న నేతలకు నాయకులకు కార్యకర్తలకు స్వాగతం పలుకుతున్నాం అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలు తోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు విశేష స్పందన రావడం హర్షణీయమని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎలక్షన్లో ప్రతి ఒక్కరూ కష్టపడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని ప్రతి పేదవాడికి కాంగ్రెస్ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొంతమంది అధికార దాహంతో దోచుకు తిన్నది కాకుండా కేవలం మూడు నెలలు కూడా గడవకముందే కాంగ్రెస్ పార్టీ నీ అప్రతిష్టపాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.



ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు టిఆర్ఎస్ పార్టీని వారు చెప్పే మాయమాటలను ప్రజలు వినే స్థితిలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి,రాష్ట్ర మహిళా నాయకురాలు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పుష్ప రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, సాధు ప్రతాప్ రెడ్డి కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, స్వరూప, మేకల, మైఖేల్, దేవ సహాయం, సంజీవరావు, ఫణింద్ర, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి మల్లన్నకు పెద్దపట్నం

## శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

**సిద్దిపేట,మార్చి7(మరో ఉదయం):**

కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి నాడు ఆలయం తరపున నిర్వహించే 'పెద్దపట్నం' ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ వైవిధ్య పూజా కార్యక్రమం తెలంగాణకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.దీనికోసం భారీగా భక్తులు తరలిరానున్నారు. పట్నం' అంటే స్వామికి కల్యాణం చేయడం. హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లికి ముందు 'పోలు' (బియ్యంతో పోయడం) కార్యక్రమాన్ని కొమురవెల్లిలో వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. ఆలయం వద్ద 'పట్నం' వేయడమంటే స్వామికి కల్యాణం చేసినట్లుగా భక్తులు భావిస్తారు. శివరాత్రి నాటి అర్ధరాత్రి పంచవర్ణాలతో పెద్దపట్నం వేస్తారు. దాదాపు 50 గజాల వైశాల్యంతో వేసే ఈ ముగ్గును వివిధ ఆకారాలతో 42 వరుసలతో వేస్తారు. 3 గంటల పాటు 20 మంది ఒగ్గు పూజారులు, కళాకారులు దీనికోసం శ్రమిస్తారు. క్వింటాళ్ల కొద్దీ పసుపు, కుంకుమ, తంగేడు ఆకులతో తయారైన చూర్ణం, బియ్యపు పిండిని వినియోగిస్తారు. పట్నం వేయడం పూర్తయ్యాక ఆలయ అర్చకులు స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి పెద్దపట్నం వద్ద నిలిపి, పూజలు నిర్వహిస్తారు. అక్కడే స్వామి కల్యాణం నిర్వహిస్తారు. గతంలో ఆలయం ముందు గంగరేణి చెట్టు వద్ద పట్నం వేసేవారు. రెండేళ్లుగా తోటబావి వద్ద నిర్మించిన కల్యాణ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందంగా, అకర్షణీయంగా పంచ రంగుల చూర్ణం (పొడి)తో ముగ్గు (పట్నం) పరుస్తారు.మొదట ఉత్సవ విగ్రహాలతో అర్చకులు పెద్దపట్నం దాటుతారు. ఆ సమయంలో పసుపు పులుముకున్న పరిసరాలన్నీ శుభమస్తు అని దీవించినట్లుగా బంగారువర్ణాన్ని అద్దుకుంటాయి.



# కాకతీయ కళావైభవం వేయిస్తంభాల గుడి

## శివరాత్రి వేడుకలకు ముస్తాబు

**వరంగల్,మార్చి7(మరో ఉదయం):**

కాకతీయుల కళావైభవానికి, భక్తి పారవశ్యానికి నిలయం హన్మకొండ వేయి స్తంభాల దేవాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవ వేడుకల ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. భక్తి భావంతో పాటు ఆలయంలో శిల్పకల ఉట్టిపడుతుంది. వేయి స్తంభాల దేవాలయాన్ని త్రికుటాలయంగా పిలుస్తారు. వేయి స్థంబాల పేరుతో నిర్మితమైన ఆలయ వైభవం నేటికి కొనసాగుతుంది. ఈ దేవాలయంలో శివలింగాన్ని రుద్రేశ్వర స్వామిగా కొలుస్తారు. అంతేకాదు వేయిస్థంభాల దేవాలయానికి మరో విశిష్టత ఉంది. శివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వేలాదిగా భక్తులు స్వామి వారిని అభిషేకిస్తారు. దీంతో ఇక్కడ శివునితోపాటు విష్టుమూర్తి, సూర్య భగవానుడు కొలుపుదీరాడు. 850 ఏళ్ల ఘనచరిత కలిగి దేశంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందిందీ ఆలయం. క్రీ.శ. 1163లో కాకతీయుల రాజు రుద్రదేవుడి హయాంలో వేయిస్తంభాల ఆలయాన్ని నిర్మించారు. వేయి స్తంభాలతో ఆలయంతో పాటు ఆలయానికి ఎదురుగా కళ్యాణ మండపాన్ని అత్యంత సుందరనీగా తీర్చిదిద్దారు. కాకతీయులు శివభక్తులు కావడంతో వేయిస్తంభాల దేవాలయంలో భారీ ఆకారంలో ఉన్న శివలింగాన్ని ప్రతిష్టించారు. శైవ క్షేత్రాల్లో సాధారణంగా శివునికి, శివలింగానికి ఎదురగా నందీశ్వరుడు ఉంటారు. కానీ వేయిస్తంభాల దేవాలయంలో బిన్నంగా సూర్యభగవానుడు కొలువై ఉంటారు. ఈ ఆలయం మరో విశిష్టతను కల్గిఉంది. హరిహర వేదాలు రాకుండా ఆలయానికి త్రికూటాలయంగా నామకరణం చేసి శివునికి ఎడమై వైపున విష్టుమూర్తిని, ఎదురుగా సూర్యభగవానున్ని ప్రతిష్టించారు. విష్టుమూర్తి కి నిత్యకళ్యాణం మచ్చతోరణం అన్నట్లు నిత్యపూజలు జరుగుతాయి కాబట్టి విష్టుమూర్తికి ఎదురుగా నందీశ్వరుడి విగ్రహం విగ్రహం వెనకాల కళ్యాణమండపం నిర్మించారు. ఇక్కడ శివునితోపాటు విష్టుమూర్తి, సూర్యభగవానుడు నిత్య పూజులు అందుకోనేవారు. ఆలయంలోని శివలింగంపై ఉదయం 5 గంటల 30 నిమిషాలు 6 గంటల మధ్యంలో సూర్యకిరణాలు నేరుగా పడతుంటాయి.



# లిక్కర్ కేసు పెద్దదేమీ కాదు

## దాన్ని మా లీగల్ టీమ్ చూసుకుంటుంది

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధీమా


**హైదరాబాద్,మార్చి7(మరో ఉదయం):**

లిక్కర్ కేసు పెద్ద కేసు కాదని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. కేసును టీవీ సీరియల్ కేసు లెక్క లాగుతున్నారు.. నాకు ఆమె అన్నారు. ఆదర్శ్ కుంభకోణం ఏమైందని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. సీతక్కకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, మహిళ అయిన ఆమెకు డిప్యూటీ సీఎం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అనుభవరాహిత్యం, అవగాహన లోపంతో సీఎం రేవంత్ పాలన ఉందని, అలాంటి ముఖ్యమంత్రి ఉండడం మన ఖర్మ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్ధతతో రాష్ట్రంలో కృత్రిమ కరువు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లను ఎత్తిపోయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ డీఎన్ఏలోనే మోదీతో స్నేహం ఉందని చెప్పారు. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు చనిపోతుంటే ముఖ్యమంత్రి పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ భాష ఎలా ఉంది.. ఆయనపై కేసులు పెట్టాలన్నారు. మహిళల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలని రెండు జాతీయ పార్టీలూ చూస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవకపోతే ప్రజలకే నష్టమన్నారు.

# మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి రాజీనామా

## అనూహ్య నిర్ణయం తీసుకున్న పద్మ

**అమరావతి,మార్చి7(మరో ఉదయం):**




ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు చాలా వేగంగా మారుతున్నాయి. నోటిఫికేషన్ రాకుండానే ఊహించని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అనూహ్యంగా రాజీనామా చేశారు. అసలు ఆమె ఎందుకు రాజీనామా చేశారు. దీని వెనుకు ఉన్న రాజకీయ కారణమేంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. జగన్‌కు అత్యంత నమ్మకమైన వైసీపీ నేతల్లో వాసిరెడ్డి పద్మ ఒకరు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమెను మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా చేశారు. ఆమె ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినప్పటికీ సమీకరణాలతో ఆమెకు టికెట్ దక్కలేదు. దీంతో ఈ పదవిని జగన్ అప్పగించారు. హిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వంపై ఈగ వాలనీయకుండా చూసుకున్నారు. ప్రభుత్వానికి మహిళలకు మధ్య వారధిలా నిలిచారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రాలు, దిశ చట్టం గురించి విస్తృతంగా ప్రచారం కల్పించారు. మహిళా కోటాలో ఈసారి వైసీపీ టికెట్ తనకు వస్తుందని చాలా బలంగా నమ్మారు వాసిరెడ్డి పద్మ. మైలవరం, జగ్గయ్యపేట రెండింటిలో ఏదో ఒక చోట నుంచి తనకు టికెట్ వస్తుందని కూడా ఆశించారు. కానీ సమీకరణాలు, ఇతర కారణాలతో ఆమెకు టికెట్ ఇవ్వలేకపోయారు. దీనిపై కాస్త నొచ్చుకున్నట్టు కూడా తెలుస్తోంది. అయితే తన రాజీనామాకు పార్టీ టికెట్‌కు సంబంధం లేదని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వైసీపీ ప్రభుత్వం వచ్చేందుకు, జగన్‌ను రెండోసారి సీఎంగా చేసేందుకే రాజీనామా చేసినట్టు వాసిరెడ్డి పద్మ చెబుతున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేమని.. అందుకే ఆ పదవికి రాజీనామా చేస్తున్నట్టు చెబుతున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలతో మమేకం కావాలన్నా... ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వాలన్నా పార్టీ వేదికే అందుకు కరెక్ట్‌గా వాసిరెడ్డి పద్మ భావిస్తున్నారు.

# కెపిహెచ్బి కాలనీ శ్రీ కామాక్షి సమేత ఏకాంబరీశ్వర దేవాలయం లో ఘనంగా మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లు....

**మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి**

కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని కెపిహెచ్బి కాలనీ రోడ్డు నెంబర్ మూడు లో గల శ్రీ కామాక్షి సమేత ఏకాంబరీశ్వర దేవాలయం ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పివి శ్రీ రమణ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో పలు రకాల విద్యుత్ కాంతులతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పివి శ్రీరామన ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాల నుండి మహాశివరాత్రి వేడుకలు ఇక్కడి ప్రాంతంలో కానీ విని ఎరుగని రీతిలో జరుగుతుండడం ఆనవైతగా వస్తుంది. ఈ సంవత్సరం కూడా శివరాత్రి వేడుకలకు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేసి ఉంచారు. పెద్ద ఎత్తున విద్యుత్ దీపాల అలంకరణతో పురవీధులన్నీ రాత్రిపూట దగదగా మెరిసిపోతున్నాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలియజేశారు. పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా బిజెపి నేత ఈటల రాజేందర్ తో పాటు పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని చెప్పారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమణ అనంతరం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని శ్రీ రమణ స్పష్టం చేశారు.





# కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీలో చేరికలు...

**మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి**

బుధవారం రోజున కూకట్పల్లి నియోజకవర్గం బేగంపేట్ డివిజన్ శ్యామలాల్ బిల్డింగ్ మయూర్ మార్గ్ చెందిన బారస నాయకులు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ మరియు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి ల సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కూకట్పల్లి ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, పద్మారెడ్డి, మోహన్ రెడ్డి, దీపు కుమార్, రాకేష్, %ూఖ% జహంగీర్, బబ్లు, దివాకర్, సికందర్ వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్బంగా బండి రమేష్ మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి వారి అనుచర బృందానికి కాంగ్రెస్ పార్టీలోకి సాధారంగా ఆహ్వానిస్తు, ప్రతిఒక్కరు పార్టీ బలోపేతానికి, కృషి చేస్తూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి కృషి చేయాలనీ అన్నారు. హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు ఆకార్షితులై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బేగంపేట రమేష్, సేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, బేగంపేట్ జాన్, భరత్ ఆలీ అంటే నేను ఎవరన్నా రా దితరులు పాల్గొన్నారు.




# కూకట్పల్లి డివిజన్ ఏసిపి కాపుగంటి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసిన పీవీ శ్రీ రమణ

**మరో ఉదయం ప్రతినిధి,కూకట్పల్లి**

కూకట్పల్లి డివిజన్ ఏసిపి గా బాధ్యతలు స్వీకరించిన కాపుగంటి శ్రీనివాసరావును కెపిహెచ్బి కాలనీకి చెందిన సీనియర్ నాయకులు, శ్రీ కామేశ్వరి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ పివి శ్రీ రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివరాత్రి మహోత్సవ వేడుకలకు రావలసిందిగా ఏసీపీని ఆహ్వానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి నాయకులు అంబాల మహేష్ గౌడ్, ప్రముఖ బిల్డర్ శ్రీకాంత్, అభినయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసిన పిసిసి నేత డాక్టర్ సత్యం శ్రీరంగం.

**మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి**

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా పదవి భాధ్యతలు స్వీకరించిన ఓబేదుల్లా కొత్వాల్ ని, తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా పదవి భాధ్యతలు స్వీకరించిన దీపక్ జాన్ ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాసంబంధాల అధికారి (పీఆర్వో)గా సీనియర్ జర్నలిస్ట్ వి.శ్రీనివాసరావు (%ూ=%)ని పిసిసి సభ్యులు టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు తదితరులు ఉన్నారు.



# ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం,ప్రజల నమ్మకాన్ని నిలబెడుతం... కాంగ్రెస్ నేత వి జగదీశ్వర్ గౌడ్

**మరో ఉదయం ప్రతినిధి శేర్లింగంపల్లి**

శేర్లింగంపల్లి నియోజకవర్గంలో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజల నమ్మకాన్ని నిలబెడుతామని కాంగ్రెస్ నేత వి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్, మొగులమ్మ కాలనీలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ,మౌళికవసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మారెళ్ళ శ్రీనివాసరావు,శశిధర్,రవి,రెహమాన్, లింగం,రఫీ,శివ, రాజా ,బాలు మహిళా నాయకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు...

## ఎమ్మెల్యే మాధవరం

**మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి**



అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మహిళలకు, ఆడపడుచులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోని స్త్రీ శక్తి చాటుతూ ముందుకు వెళుతున్న మహిళా మూర్తులు నేడు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. స్త్రీ లేనిదే సృష్టి లేదని ఎంతో భారాన్ని మోస్తున్న భూదేవిని కూడా స్త్రీ ప్రతిరూపంగా భావిస్తున్నామంటే స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని నేటి తరానికి తెలియ చెప్పాలని సూచించారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లడం ఎంతో ఆనందంగా ఉందని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కృష్ణారావు తెలియజేశారు.

# సినిమా వార్తలు



## నటులకు ఆత్మగౌరవం ముఖ్యం

### కంగనా పోస్ట్‌తో మరోమారు మంటలు

నిత్యం ఏదో ఓ వివాదంలో ఉండే కంగనా రనౌత్ మరోసారి వార్తల్లోకెక్కారు. ఈసారి ఇన్‌డైరెక్ట్‌గా తన ఇండస్ట్రీపైన, సెలబ్రిటీలపైనే సెటైర్లు వేసి బాలీవుడ్‌లో మంట లేపింది. ఇప్పుడు ఈ విషయం హిందీ పరిశ్రమతో పాటు సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఏ విషయం మనసులో దాచుకోకుండా మోహం మీద కొట్టినట్లు చెప్పే ఈ ముద్దుగుమ్మ తాజాగా నటులకు ఆత్మగౌరవం ముఖ్యమంటూ ఓ పోస్టు పెట్టి అగ్గి రాజేసింది. విషయానికొస్తే.. ఈ మధ్య గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో అంబానీ ఇంట్లో అనంత్, రాధికల ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ మూడు రోజుల పాటు జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలకుదే , విదేశాల నుంచి చాలా మంది పెద్ద ప్రముఖులు హజరైన సంగతి తెలిసిందే. అదేవిధంగా బాలీవుడ్ నుంచి కూడా దాదాపు టాప్ స్టార్స్ హీరో హీరోయిన్స్ అందరు పాల్గొనడమే కాక ఆడి పాడారు. ఆ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో బాగానే వైరల్ అయ్యాయి. అయితే ఈ కార్యక్రమంలో బాలీవుడ్ క్వీన్‌గా పేరు సంపాదించుకున్న కాంట్రవర్సీ క్వీన్ కంగనా రనౌత్ పార్టిసిపేట్ చేయలేదు కానీ పరోక్షంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై కామెంట్లు చేసింది. దీంతో ఈ అంశం నార్త్‌లో బాగా చర్చనీయాంశం అవుతోంది. అసలు ఆమె సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టు సారాంశం ఏంటంటే.. ప్రతి ఒక్కరికి డబ్బుకంటే ఆత్మగౌరవం ముఖ్యమని నేను నా సెల్ఫ్ రెస్పెక్ట్‌ను చంపుకోలేనంటూ గతంలో లతా మంగేష్కర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలను కంగనా రనౌత్ గుర్తు చేసింది. గతంలో లతా మంగేష్కర్ గారు చెప్పిన మాటలను నేను ఇప్పటికీ తూచా తప్పకుండా పాటిస్తానని, అవతలి వారు ఎంత ధనవంతులైనా వారెంత డబ్బిచ్చినా పెళ్లిళ్లలో పాడనని చెప్పి తను మరణించేంత వరకు ఆ మాట మీదనే ఉందన్నారు. నేను పుట్టి ఈ స్థాయికి వచ్చేంత వరకు కూడా ఆర్థికంగా చాలా ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ, అవతలి వాళ్లు కోట్లలో డబ్బు ఇస్తామని చాలా సార్లు ఆఫరిచ్చినా వేరే వాళ్ల వేడుకల్లో డ్యాన్సులు చేయలేదని, చివరకు ఐటమ్ సాంగ్స్ కూడా చేయలేదని కంగనా రనౌత్  స్పష్టం చేశారు.

## రామ్‌చరణ్ బర్త్‌డే కానుక

### 23న నాయక్ రీ రిలీజ్‌కు సన్నాహాలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్  బర్త్ డే కానుకగా ఆయన నటించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం నాయక్ రీ రిలీజ్ కానుంది. రామ్ చరణ్ సరసన అందాల భామలు కాజల్ అగర్వాల్  అమలాపాల్ నటించిన ఈ చిత్రానికి వి.వి.వినాయక్ దర్శకత్వం వహించగా, డి.వి.వి.దానయ్య నిర్మించిన సంగతి తెలిసిందే. దాదాపు పన్నెండేళ్ల క్రితం వచ్చిన ఈ చిత్రం అభిమానులతో పాటు ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం రీ రిలీజ్ అయితే మళ్ళీ చూడాలని ప్రేక్షకాభిమానులు కోరుకుంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రముఖ నిర్మాత నట్టి కుమార్ ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.  సందర్భంగా నట్టి కుమార్ మాట్లాడుతూ, 'మార్చి 27న రామ్ చరణ్  బర్త్ డేని పురస్కరించుకుని, కాస్త ముందుగా మార్చి 23న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నాం. ఇందులో రామ్ చరణ్ తన పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేశారు. హీరోయిన్లు కూడా పోటీ పడి నటించారు. మిగతా పాత్రధారులు కూడా తమ పాత్రలలో ఒదిగిపోయారు. చిత్రంలో అన్ని అంశాలు ఉన్నాయి. కామెడీకి కూడా పెద్ద పీట వేశారు. తమన్ సంగీతాన్ని అందించిన ప్రతీ పాట హైలైట్ గా ఉంటుంది. ఛోటా కె.నాయుడు సినిమాటోగ్రఫీ ఓ ఆకర్షణగా నిలుస్తుంది' అని అన్నారు.




## బాలకృష్ణకు సెట్‌లో కోపం ఎక్కువ

### దర్శకుడు  రవికుమార్ వ్యాఖ్యలపై

### అభిమానుల ఆగ్రహం

నందమూరి బాలకృష్ణ, తమిళ దర్శకుడు కెఎస్ రవికుమార్ తో రెండు సినిమాలు వరసగా చేశారు. 2018లో 'జై సింహ' ఆ తరువాత మరుసటి సంవత్సరం అంటే 2019లో 'రూలర్' అనే సినిమాకి పనిచేశారు. ఇప్పుడు రవికుమార్ వార్తల్లో వున్నారు, ఎందుకంటే అతను బాలకృష్ణపై చేసిన కొన్ని వ్యాఖ్యలకు అభిమానులు రవికుమార్ పై ఫైర్ అవుతున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే రవికుమార్ 'గార్డియన్' అనే తమిళ సినిమా మీడియా సమావేశానికి హాజరయి అక్కడ బాలకృష్ణపై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి, అందుకని బాలకృష్ణ అభిమానులు రవికుమార్ ట్రోల్ చేస్తున్నారు. ఇంతకీ రవికుమార్ బాలకృష్ణ గురించి ఏమ్మన్నారంటే 'షూటింగ్ సమయంలో ఎవరేనా నవ్వితే బాలకృష్ణకి కోపం వస్తుందని, వెంటనే ఆ నవ్విన వ్యక్తిని పిలిచి కొడతారని' చెప్పారు రవి కుమార్. అలా ఒకసారి బాలకృష్ణతో సినిమా చేస్తున్నప్పుడు తన సహాయ దర్శకుడు అయిన శరవణన్ ని ఫ్యాన్ తనవైపు తిప్పమన్నాను అని, అతను అనుకోకుండా ఆ ఫ్యాన్ బాలకృష్ణ వేపు తిప్పాడని, ఆ గాలికి బాలకృష్ణ విగ్ ఒక్కసారిగా కదిలిందని, అది చూసి సహాయ దర్శకుడు వెంటనే నవ్వాడని చెప్పారు రవికుమార్. అతను నవ్వటం చూసి బాలకృష్ణకి వెంటనే కోపం వచ్చిందని, 'ఎందుకు నవ్వుతున్నావ్' అని గట్టిగా అతనిపై అరిచారని, ఎక్కడ సహాయ దర్శకుడిని కొడతాడో అని నేను బాలకృష్ణ దగ్గరికి వెళ్లి సర్ది చెప్పాను అని రవికుమార్ చెప్పుకొచ్చారు. అయినా కూడా బాలకృష్ణ వినలేదు అని, ఆ సహాయ దర్శకుడిపై అరిచి అక్కడనుంచి వెళ్లిపొమ్మని చెప్పారని రవికుమార్ అప్పుడు జరిగిన సంఘటనలను చెపుతూ బాలకృష్ణ గురించి చెప్పుకొచ్చారు. బాలకృష్ణ అభిమానులు రవి కుమార్ చేసిన వ్యాఖ్యలని తప్పుపట్టారు. బాలకృష్ణ వ్యక్తిత్వం తెలిసినవాళ్ళు ఎవరూ అలా మాట్లాడరని, ఎందుకంటే రవికుమార్ కి సినిమాలు ఎవరూ ఇవ్వనటువంటి సమయంలో బాలకృష్ణ పిలిచి మరీ అతనితో రెండు సినిమాలకి దర్శకత్వం ఇప్పించారని, అటువంటి బాలకృష్ణపై రవికుమార్ ఆలా వ్యాఖ్యలు చెయ్యడం తగదని అభిమానులు అంటున్నారు. దర్శకుడు చెప్పినట్లు చేసే నటుడు బాలకృష్ణ అని చాలా సందర్భాల్లో చెప్పి, ఇప్పుడు ఇలా వ్యంగ్యంగా మాట్లాడటం వలన బాలకృష్ణ కంటే అతని అభిమానులమైన మాకు ఇంకా ఎక్కువ కోపం వస్తోందని, రవికుమార్ పై సామాజిక మాధ్యమాల్లో బాలకృష్ణ అభిమానులు విరుచుకుపడుతున్నారు.



## సుహాస్ ప్రసన్నవదనం

టాలీవుడ్ నటుడు సుహాస్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే అంబాజీపేట మ్యారేజీ బ్యాండు సినిమాతో హిట్ కొట్టిన ఈ హీరో మరో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ముందుకువస్తున్నాడు. సుహాస్ నటిస్తున్న తాజా చిత్రం 'ప్రసన్నవదనం'. ఈ సినిమాకు అర్జున్ వైకే దర్శకత్వం వహిస్తుండగా.. పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లిటిల్ థాట్స్ సినిమాస్, అర్హ మీడియా బ్యానర్‌పై మణికంఠ ఏ÷ూ, ప్రసాద్ రెడ్డి ÷ఖీ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. ఇక ఈ టీజర్ గమనిస్తే.. సుహాస్ ఈ సినిమాలో ఫేస్ బ్లైండ్‌నెస్ అనే వ్యాధితో బాధపడుతుంటాడు. ఈ వ్యాధి వచ్చిన వారు ఒక వ్యక్తికి సంబంధించి మొహం తప్ప అన్ని గుర్తుపడతారు. అయితే ఈ వ్యాధి ఉన్న సుహాస్‌కు అనుకోకుండా ఒక సమస్య ఎదురవుతుంది. ఇక ఆ సమస్య నుంచి సుహాస్ ఎలా బయటపడ్డాడు అనేది సినిమా స్టోరీ. ఇంట్రెస్టింగ్‌గా సాగిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.




## విశ్వక్‌సేన్ గామి నేడు విడుదల

విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'గామి' విద్యాధర్ కాగిత ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. చాందినీ చౌదరి కథానాయిక. మార్చి 8న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. అడివి శేష్, హనురాఘవపూడి తదితరులు ముఖ్య అతిథులుగా హాజ రయ్యారు. 'విద్యాధర్ కాగిత వంటి గొప్ప వ్యక్తిని నేను జీవితంలో చూడలేదు. తన మాటపై ఉన్న నమ్మకంతో ఈ సినిమా చేశాను. మంచి కథ కచ్చితంగా హిట్ అవుతుంది. ప్రేక్షకుల్ని కట్టిపడేసే సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. శివరాత్రికి విడుదల చేయాలని అనుకోలేదు. ఇది దైవ నిర్ణయం. విభిన్నమైన కథతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల మదిలో నిలిచిపోతుంది. మంచి సినిమా చూశామన్న ఫీలింగ్ అందరికీ కలుగుతుంది. ఎంతో రిస్క్ చేసి దీన్ని తెరకెక్కించాం. అందరూ గర్వపడే సినిమా ఇది. మా కష్టానికి తగిన ఫలితం దక్కుతుందనే నమ్మకం ఉంది. చాందినీ చౌదరి ఈ సినిమా కోసం కష్టపడింది. మార్చి 8న థియేటర్‌లో కలుద్దాం' అని విశ్వక్‌సేన్ అన్నారు. తాజాగా రాజమౌళి  దీనిపై ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. కఠోరమైన కృషి ఉంటే అసాధ్యమైన కలలు సాకారమవుతాయి. 'గామి' గురించి దర్శకుడు, నిర్మాత ఎంత కష్టపడ్డారో నాతో చెప్పినప్పుడు ఈ మాట గుర్తొచ్చింది.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com